## క్లుప్తంగా

### ఫిజియోథెరపీ వైద్యసేవలపై అవగాహన



ఫిజియోథెరపి వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: ఫిజియోథెరపీ వైద్య సేవలపై ఫిజియోథెరపిస్టు వెంకటరావు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం టీఏలు, ఎఫ్ఏలకు అవగాహన కల్పించారు. ఫిజియోథెరపీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ఎంపీడీఓ ఎం.రంగ సుబ్బరాయుడు, సీనియర్ అసిస్టెంట్ జి.రమేష్, కార్యదర్శులు, ఏపీఓ, టీఏలు, పీఏలు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పాఠశాల వార్షిక వేడుకలు



కంభంపాడులో పాఠశాల వార్షికోత్సవ కేక్ కోస్తున్న సర్పంచ్, హెచ్ఎం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కంభంపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం పాఠశాల హెచ్ఎం సంజీవరాణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌యం, సర్పంచ్ మర్రి రామయ్యలు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్‌ను కోసి పంచిపెట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, షేక్.మహబూబ్‌జాని, పీఎంసీ చైర్మన్ రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని ప్రచారం

పొన్నలూరు: మండలంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు పొన్నలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చేరాలని కళాశాల సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోకుండా కళాశాల సమాచారంతో కరపత్రాలు, గోడ పత్రికలు అంటిస్తూ గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు మాట్లాడుతూ కళాశాల ప్రారంభించింది మొదలు ఉత్తమ ఫలితాలతో విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలని ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించి బలోపేతానికి సహకరించాలని కోరారు.

### కూటమి ప్రభుత్వంలో దళితులపై పెరిగిన దాడులు



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

కనిగిరిరూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయని అంబేడ్కర్ ధర్మపోరాట సమితి రాష్ట్ర నాయకుడు చదలవాడ బాలగురవయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. పీతాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయడాన్ని నిరసిస్తూ.. దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి నియోజకవర్గంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసినా కనీసం నోరెత్తలేని దుస్థితిలో ఉండటం సిగ్గు చేటన్నారు. నేటి కూటమి పాలనలో ఆటవిక రాజ్యం నడుస్తోందని ఘాటుగా విమర్శించారు. వివిధ, పార్టీల, సంఘాల నాయకులు శాంతరాజు, న్యాయవాది చింతంగుంట్ల కిషోర్, దమ్ము చెన్న కేశవులు, ఖాదర్‌బాషా, దమ్ము వెంకటేష్, కొటికర్లబాదుర్లా, కుందుర్తి వెంకటేశ్వర్లు, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, కొండయ్య, పరశురాం, సురేంద్ర, బాలయ్య, విశ్వనాథం పాల్గొన్నారు.

### 28న మెగా జాబ్‌మేళా

కందుకూరు: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉప్పుచెరువు రోడ్డులోని పాలిటెక్నిక్ కాలేజీలో ఈనెల 28 మెగా జాబ్‌మేళా ఉంటుందని ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్‌ఖయ్యూం, కాలేజీ ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్‌లు తెలిపారు. ఈ మేరకు జాబ్‌మేళా ప్రచార వాల్‌పోస్టర్ మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ జాబ్‌మేళాకు ఫాక్స్‌కాన్ ప్రైవేట్ లిమిటెడ్, ఆట్రియెస్టు టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, టీసీఎల్, ఏరిస్ ఆగ్రో లిమిటెడ్, హీరో మోటోకార్ప్ లిమిటెడ్, అమరరాజా బ్యాటరీస్, క్రిస్ ఫైనాన్స్ లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ తదితర ప్రముఖ 14 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటారని తెలిపారు. ఆయా కంపెనీల ఉద్యోగాలకు టెన్త్, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 19 నుంచి 30సంవత్సరాల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 98480 50543, 79896 13024 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# మట్టి కొట్టుకుపోతారు..!



చెరువులో గ్రావెల్ తవ్వుతున్న జేసీబీ



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

- యథేచ్ఛగా గ్రావెల్, మట్టి తరలింపు
- రెవెన్యూ, పోలీసుల మొద్దు నిద్ర
- రోజుకు 300 ట్రిప్పుల పైనే తరలింపు

ఉలవపాడు:

కూటమి ప్రభుత్వం పంచభూతాలను సైతం చెరబట్టింది. ఏ ఒక్క దానిని వదలకుండా యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తరలించుకుపోతున్నారు. ఈప్రభుత్వంలో ప్రకృతి విధ్వంసం జరుగుతున్నా పట్టించుకున్నా అధికారే లేకపోవడం శోచనీయం. చెరువుల నుంచి గ్రావెల్, మట్టి యథేచ్ఛగా తరలివెళ్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక, మట్టి, గ్రావెల్‌ను పట్టపగలే యథేచ్ఛగా తరలిస్తున్నారు. మనల్ని ఎవడ్రా ఆపేది అన్న చందంగా వారు ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. దీనికి అండగా అధికారులు మొద్దు నిద్రను నటిస్తున్నారు. ఎక్కడ ఎంత దోపిడీ జరిగినా తమకేమీ కనపడలేదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని ప్రజలు అంటున్నారు. మంగళవారం మండల పరిధిలోని వీరేపల్లి గ్రామ చెరువు నుంచి యథేచ్ఛగా జేసీబీని పెట్టి ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నారు. పట్టపగలే జేసీబీని ఏర్పాటు చేసి జాతీయ రహదారిపై నుంచి గ్రావెల్ తరలివెళుతున్నా కనీసం పట్టించుకున్న అధికారులు లేరు. గ్రామానికి చెందిన ఇద్దరు కూటమి నాయకులు ఈ గ్రావెల్‌ను తరలించి అమ్ముకుంటున్నారు. మంగళవారం ఒక్కరోజే సుమారు 300 ట్రిప్పుల పైనే గ్రావెల్‌ను తరలించారు. గత కొంత కాలంగా ఈ వీరేపల్లి గ్రామ చెరువు నుంచి సుమారు 1200 ట్రిప్పుల పైనే ఇప్పటివరకు గ్రావెల్ తరలించారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

**చెరువు స్వరూపాలు మారుతున్న దుస్థితి..**

బరితెగించి గ్రావెల్ తరలిస్తున్నా కనీసం అధికారులు పట్టించుకోని పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జేసీబీని ఏర్పాటు చేసి గ్రావెల్‌ను తరలిస్తున్నా రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారులు కానీ, పోలీసులు కానీ కనీసం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. చెరువు మధ్యలో గుంతలమయంగా మారి ఇబ్బందికరంగా మారిన పరిస్థితి ఉంది. చెరువుల స్వరూపమే మారిపోతున్నా నీటిపారుదల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దునిద్ర వీడి గ్రావెల్ తరలింపును నిలుపుదల చేయాలని కోరుతున్నారు.

# నిస్వార్థ సేవకుడు హనీఫ్



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, ఇతర నేతలు

కనిగిరిరూరల్: తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం తుది శ్వాసవరకు పనిచేసిన ప్రజా ఉద్యమనేత, నిస్వార్థ ప్రజా సేవకుడు సయ్యద్ హనీఫ్ అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యుడు వై రవీంద్రబాబు అన్నారు. సయ్యద్ హనీఫ్ 34వ వర్ధంతిని మంగళవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక 10వ వార్డులోని హనీఫ్ స్థూపం వద్ద డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అధ్యక్షతన వర్ధంతి సభలో చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి మేజర్ గ్రామ పంచాయతీకి ఉప సర్పంచ్‌గా 20 ఏళ్లు పనిచేసిన.. హనీఫ్ ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయాన హయాంలో చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నేటికీ పట్టణంలో ఆనవాళ్లుగా ఉన్నాయని గుర్తు చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్, న్యాయవాదుల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య, టెలికాం అడ్వయిజరీ కమిటీ మెంబర్ పీర్ల మస్తాన్‌వలి, న్యాయవాది ఎస్‌డీ షాహీద్, వైఏఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రభాకర్, జి.బాలిరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నేతగా హనీఫ్ చేసిన పోరాటాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. సుమారు 3 వేల ఎకరాలను పేదలకు భూ పంపిణీ చేసేందుకు హనీఫ్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. సాగర్ కుడికాలువ సాధన, కనిగిరికి వెలిగొండ జలాలల సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో ఆయన క్రియాశీలకంగా పనిచేశారన్నారు. తొలుత సీనియర్ నాయకుడు ఎస్‌డీ షౌకత్ అలీ జెండాను ఆవిష్కరించారు. హనీఫ్ వర్ధంతిని పురస్కరించుకొని కుటుంబసభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ, అల్పాహారం ఏర్పాటు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, చింతం శ్రీను, పసుపులేటి అరుణోదర్, మాజీ కౌన్సిలర్లు ఎస్‌డీ జిలాని, సయ్యద్ నాయబ్ రసూల్, థెరిస్సా సేవా సమితి నాయకులు వాగిచర్ల వెంకటేశ్వర్లు, పచ్చవ శేఖర్, ఎల్ఐసీ నారాయణ, చెరుకూరి చిన కాశయ్య, ద్రోణాదుల చెంచులు, పఠాన్ ఖాదర్ ఖాన్, ఎస్‌డీ మౌలాలి(ఆర్ట్) తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

- డీటీసీఓ బెజవాడ శ్రీవాణి



పొన్నలూరులో మాట్లాడుతున్న డీటీసీఓ శ్రీవాణి

పొన్నలూరు: ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా క్షయ, ఎయిడ్స్, కుష్టు వ్యాధుల నివారణ అధికారి బెజవాడ శ్రీవాణి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలందించే ఫ్రంట్ లైన్ వారియర్స్(ఆరోగ్య సిబ్బంది)మొదటిగా అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకొని అవసరాన్ని బట్టి చికిత్స పొందాలన్నారు. గ్రామాల్లో క్షయ, కుష్టు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను గుర్తించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కావాల్సిన మందులను అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అందే వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు కృష్ణచైతన్య, రవికిరణ్, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, డీపీపీ సురేష్, పీపీఎం కోటేశ్వరరావు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కూలి ఇవ్వడం లేదని కూలీల నిరసన



దొడ్డిచింతలలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కూలీలు

హనుమంతునిపాడు: 10 వారాల నుంచి ఉపాధి హామీ కూలి నగదు ఇవ్వడంలేదని కూలీలు నిరసనకు దిగారు. ఈ సంఘటన మండలంలోని దొడ్డిచింతల గ్రామంలో మంగళవారం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో సంఘం ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని చేసిన వారంలోనే బిల్లులు చెల్లించాలని చట్టం చెబుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. 10 వారాలుగా బకాయిలు పేరుకుపోయినా పట్టించుకునే వారు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో ఉపాధి కూలీలకు రూ.25 కోట్ల మేర కూలి చెల్లించాల్సి ఉందన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజలకు ఉపాధి కూలీ తప్ప మరోక పని లేదన్నారు. ఈ ప్రాంతం అంత మెట్ట ప్రాంతమని, కూలీలకు చేసిన బిల్లులు అందక పేద కుటుంబాల వారు పస్తులుంటున్నారని వాపోయారు. ఉపాధి కూలీలకు వెంటనే రావాల్సిన కూలీల బకాయిలు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు చలగపార్లు, గడ్డపలుగులు ఇవ్వాలని, పని ప్రాంతంలో తాగునీరు, వసతులు కల్పించాలని కోరారు.

### ప్లాస్టిక్ నిషేధించి ధరిత్రిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: మనం భూమిని కాపాడితేనే.. మన భవిష్యత్ భద్రమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి అధ్యక్షతన ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పర్యావరణ సమస్యల నుంచి మన భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరం తీసుకోవాలని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, గుడ్‌హెల్ప్ సంస్థ ప్రతినిధి మండ్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ



ఎం రుషికా రాణి



దోగుపర్తి నాగూర్‌బీ

కనిగిరిరూరల్: ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో కనిగిరి ఆల్ఫా విద్యార్థులు ప్రతిభ చాటారు. బీఎస్సీ (అగ్రి)లో ఎం రిషికా రాణి 356/400, ఉమా మహేశ్వరి 323/400 మార్కులు, బీఎస్సీ (మాథ్స్)లో బి.కళ్యాణి 363/400 మార్కులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆల్ఫా విద్యా సంస్థల అధినేత జి.మాలకొండారెడ్డి, కరణం చెంచుబాబు, సమీర్, పాపిరెడ్డి, జ్యోతి, గని, అధ్యాపకులు అభినందించారు. ఆంధ్ర యూనివర్సిటీ డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎస్ఎం విద్యార్థులు ప్రతిభ చాటారు. బీఎస్సీ(జువాలజీ)లో దోగుర్తి నాగూర్‌బీ 348/400, బీఎస్సీ కంప్యూటర్‌లో మాదాల తరుణి 343, బీఎస్సీ (బోటనీ)లో తమ్మిశెట్టి సుశీత 317, బీకాం కంప్యూటర్‌లో రావి జ్యోతి 309, మార్కులు సాధించినట్లు డైరెక్టర్ నరేన్ చౌదరి తెలిపారు. బీఏ పొలిటికల్‌లో చిలకా ప్రణవీ 323, గొల్ల వెంకట స్వరూప 323 మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంఎస్ఎం విద్యాసంస్థల అధినేత ఏలూరి సుబ్బారావు, అధ్యాపకులు అభినందించారు.

### ఆరుగురు జూదరుల అరెస్టు

కొండపి: మండలంలోని చిన్నవెంకన్నపాలెంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చిన్నవెంకన్నపాలెంలో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.2,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# బాలికా విద్యతో సమాజానికి వెలుగు



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న మానవత సంస్థ కమిటీ

పామూరు: బాలికా విద్యతోనే సమాజానికి వెలుగు, సమాజాభివృద్ధి సాధ్యమని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల చైర్మన్ కె.రామిరెడ్డి, అధ్యక్షుడు మెడబలిమి ముసలయ్య అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మంగళవారం విద్యాలయం ప్రిన్సిపాల్ కటకం సజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇటీవల సీనియర్ ఇంటర్మీడియెట్‌లో జిల్లా స్థాయిలో కేజీబీవీల్లో ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించిన స్థానిక విద్యార్థుల అభినందన, ప్రోత్సాహక బహుమతుల కార్యక్రమం నిర్వహిచంచారు. ఈ సందర్భంగా ఎంపీసీలో జిల్లాలో ప్రథమస్థానం సాధించిన టి.శ్రీదేవి(960), ద్వితీయ స్థానం సాధించిన డి.హేమశ్రీ(952)లకు, ప్రోత్సాహక నగదును సంస్థ చైర్మన్, అధ్యక్షులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ విద్యాలయాలు పేద బాలికలకు వరంలాంటివన్నారు. విద్యాలయాలను పేద విద్యార్థులు ఉపయోగించుకుని మెరుగైన ఫలాతాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో తోట రమేష్, టి.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వరరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, వై.వెంకటసుబ్బయ్య, శైలజ, జయలక్ష్మి, సుజాత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# సమగ్ర సేద్యంతో సుస్థిర ఆదాయం



రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: గో ఆధారిత, సేంద్రీయ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతో మానవాళికి ఆరోగ్య రక్షణ అని ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌లో భాగంగా ఎం. నిడమనూరులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, లాభాల గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి యూనిట్ ఇంచార్జ్ వెంకట్రావు, విజయలక్ష్మి మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పండించే పంటలతో తయారుచేసే ఆహార ఉత్పత్తులు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. సేంద్రీయ సాగు చేసిన ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. వీఏఏ సుభాషిణి మాట్లాడుతూ ప్రతి మహిళా రైతు ఇంటిదగ్గర స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకొని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో మూడేళ్లుగా నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు శేఖర్‌ను సన్మానించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సుజాత, యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, ఐసీఆర్‌పీలు శృతి, పద్మావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# 168 బేళ్లు తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్‌కుమార్



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 168 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కోయవారిపాలెం, ధర్మవరం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకటకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు 765 బేళ్లను వేలానికి తీసుకురాగా 597 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.224, సరాసరి ధర రూ.256.06గా నమోదైంది. వేలంలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ధరలు రోజు రోజుకు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో గరిష్ట ధర రూ.280 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. క్లస్టర్ పరిధిలోని కారుమంచి గ్రామానికి చెందిన రైతులు690 బేళ్లను తీసుకురాగా 527 బేళ్లను కొనుగోలు చేసి 163 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.225, సరాసరి ధర రూ.255.72గా నమోదైంది. వేలంలో 11 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శీలంవారిపల్లెలో స్వచ్ఛభారత్‌లో భాగంగా వీధులు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పామూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నర్రమారెళ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం షేక్.మహబూబ్‌బాషా అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం భూమిని, పర్యావరణాన్ని కాపాడుకోవడం, ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిని కాపాడేందుకు ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించి గుడ్డ సంచులు వాడాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని వివరిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు తోట రమేష్, యన్.నీరజ, కే.సుజాత, బి.కోటేశ్వరరావు, ఇ.వెంకటేశ్వర్లు, డి.నాగేశ్వరరావు, ఎస్.వి.ప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): స్వచ్ఛ గ్రామాల నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య అన్నారు. స్వచ్ఛభారత్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు శీలంవారిపల్లెలో రోడ్లను శుభ్రంచేశారు. అదేవిధంగా రోడ్ల వెంట కంపచెట్లను తొలగించడంతో పాటు కాల్వల్లో బ్లీచింగ్ నిర్వహించారు.

# వైఎస్ జగన్‌ను కలిసిన పలువురు నేతలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మారంరెడ్డి గంగాధరరెడ్డి, చొప్పర శివ, పరిటాల సునీల్‌కుమార్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు నేతలు కలిశారు. పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మారంరెడ్డి గంగాధరరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పరిటాల సునీల్‌కుమార్, యువజన విభాగం నాయకుడు చొప్పర శివలు జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.